ప్రజాశక్తి

సోమవారం జూన్ 30 2025 పేజీలు 8

విజయనగరం పార్వతీపురం మన్యం





విద్యా హక్కు చట్టానికి తూట్లు



- పూర్తి కాని 25 శాతం సీట్లు
- ముందుకురాని ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

ప్రజాశకి-విజయనగరం టౌన్

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 25శాతం సీట్లను పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాల్సి ఉంది. ఆయా పాఠశాలల్లో సీట్లు పొందిన విద్యార్థులకు పలు పాఠశాలలు అడ్మిషన్లు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నాయి. ఇప్పటికే విద్యా సంవత్సరం ప్రారంభమై 16 రోజులు దాటినా ఆడ్మిషన్ ప్రక్రియ పూర్తికాకపోవటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూన్ 10 నాటికి అడ్మిషన్ ప్రక్రియ పూర్తి చేయాలని విద్యా సంవత్సరం (మిగతా.. 3లో)

ఇంతకీ ఆయన ఏ పార్టీ?



- సస్పెండ్ చేసిన వైసిపి
- తమ పార్టీ కాదంటున్న టిడిపి
- రఘురాజును దూరం చేయడానికి కారణాలేమిటో?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఆయన ఓ ఎమ్మెల్సీ... ఏడాది క్రితం వరకు వైసిపి తరపు... ఆ పార్టీ సస్పెండ్ చేయడంతో పరోక్షంగా టిడిపి మద్దతు. ఇప్పుడు ఆ పార్టీ దూరం చేసింది. తాజాగా ఆ ఎమ్మెల్సీ తమ పార్టీకి చెందినవాడు కాదని, ఆయన వైసిపికి చెందినవాడేనని శృంగవరపుకోట ప్రాంతానికి చెందిన ఓ నాయకుడు తేల్చిచెప్పడమే ఇందుకు నిలువెత్తు నిదర్శనం. ఆయన ఏపార్టీకి చెందకపోయినా ప్రజలకొచ్చే నష్టమేమీ లేకపోయినప్పటికీ, నిన్నమొన్నటి వరకు పాలకపార్టీలు రెండు ఆయన్ని (మిగతా.. 3లో)



కేన్సర్ రోగులతో మాట్లాడుతున్న గంగునాయుడు

కేన్సర్ మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు చెల్లించాలి

సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

ప్రజాశక్తి - కొమరాడ

కేన్సర్‌తో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం రూ.25 లక్షలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని గంగరేగువలసలో ఆదివారం గత కొన్నాళ్లుగా కేన్సర్‌తో బాధపడుతున్న (మిగతా.. 3లో)

'సచివాలయాన్ని ముట్టడిస్తాం'

ప్రజాశక్తి- బాడంగి

మూడు రోజుల్లో బకాయి ఉన్న జీతాలు చెల్లించకపోతే సచివాలయాన్ని ముట్టడిస్తామని సిపిఎం మండల నాయకులు సురేష్ హెచ్చరించారు. మండలంలోని వాడాడ గ్రీన్ అంబాసిడర్లతో కలిపి ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. గ్రామాలను శుభ్రం చేస్తూ ప్రజల ప్రాణాలు అనారోగ్యం పాలవకుండా కాపాడుతున్న గ్రీన్ అంబాసిడర్లకు 18 మాసాలు నుంచి జీతాలు ఇవ్వకపోవడం చాలా అన్యాయమన్నారు. జీతాలు నెల నెల పడకపోవడం వల్ల అప్పులు వాడి కుటుంబ పోషణ చేస్తున్నారన్నారు. అప్పులు ఇచ్చినవాళ్లు ఇంటికి వచ్చి గొడవ పెడుతున్నారని దానివల్ల గ్రీన్ అంబాసిడర్స్ చేసేదిలేక ఇబ్బందులు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం నుంచి లక్షలు రూపాయలు నిధులు వస్తున్నా సరే గ్రీన్ అంబాసిడర్స్‌కు జీతాలు ఇవ్వక పోవడం అన్యాయమన్నారు. కొద్దిరోజుల క్రితం జనరల్ ఫండ్ ఇంటి పన్ను రూపంలో వచ్చినప్పటికీ నిధుల్లో గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు ఇవ్వాలని అధికారులకి అడిగినా ఇప్పటివరకు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు.


శంకర్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న జర్నలిస్టులు

శంకర్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

భోగాపురం ప్రజాశక్తి విలేఖరి శంకర్ ఇటీవల హఠాన్మరణం చెందిన విషయం తెలిసిందే. ఆయన మరణంతో శంకర్ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో పలువురు యువకులు తమ మానవత్వాన్ని చాటుకుంటూ సాయానికి ముందుకొచ్చారు. పూసపాటిరేగ మండలంలోని పేరాపురం గ్రామానికి చెందిన కొలచన రమేష్ ఆదివారం శంకర్ కుటుంబాన్ని పరామర్శించి, వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శంకర్ భార్యకు రూ.10వేలు నగదు సహాయం అందించారు. శంకర్ కుమార్తె సాత్విక, కుమారుడు నీహన్ చదువు నిమిత్తం ప్రతి నెలా రూ.1,000 ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. 'ఇది సహాయం కాదని, ఒక విలేకరి కొడుకుగా నా బాధ్యత మాత్రమేనని రమేష్ తెలిపారు. పూసపాటిరేగ మండలంలోని కొప్పెర్ల గ్రామానికి చెందిన బావిశెట్టి నారాయణరావు కూడా స్పందించి, శంకర్ కుటుంబానికి రూ.10వేలు చెక్కు రూపంలో అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబానికి తోడుగా నిలిచిన ఈ యువకులను గ్రామస్తులు, విలేఖరి వర్గాలు ప్రశంసిస్తున్నాయి. మరింతమంది దాతలు స్పందించి శంకర్ కుటుంబానికి అండగా నిలవాలని పలువురు కోరుతున్నారు.

మెగా జాబ్‌మేళాతో యువతకు భవిత

ప్రజాశక్తి- రాజాం

మెగా జాబ్‌మేళాతో యువతకు భవిత ఉంటుందని టిడిపి సీనియర్ నాయకులు కోండ్రు జగదీశ్ అన్నారు. నియోజకవర్గం స్థాయిలో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆదివారం భాష్యం స్కూల్లో మెగా జాబ్ మేళా నిర్వహించింది. ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జి. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ఈ మెగా జాబ్ మేళా కార్యక్రమానికి 29 బహుళ జాతి కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారన్నారు. జాబ్ మేళాకి 1155 మంది అభ్యర్థులు హాజరు కాగా పలు కంపెనీలకు 462 మంది ఎంపికయ్యారన్నారు. మరొక 65 మంది తదుపరి రౌండ్‌కు ఎంపిక చేశామని చెప్పారు. కార్యక్రమంలో ప్లేస్మెంట్ అధికారి భాస్కర్, కోఆర్డినేటర్ వంశీ కృష్ణ, ఎపిఎస్ఎస్‌డిసి స్టాఫ్, తెలుగు దేశం పార్టీ నాయకులు, బిసి సెల్ డైరెక్టర్ గురవాన నారాయణరావు, ప్రెసిడెంట్ నంది సూర్య ప్రకాష్, పార్టీ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రాజు, శాసపు రమేష్, దుప్పలపూడి శ్రీనివాసరావు, ఐటిడిపి నియోజకవర్గ ఇంచార్జి బవిరి శ్రీనుబాబు, జారజాన నితిన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు స్కూళ్లకు వసూళ్ల పండగ

- ఐఐటి, ఒలింపియాడ్ పేరుతో అధికంగా వసూళ్లు
- పుస్తకాలు, యూనిఫాం పేరిట దోపిడీ
- అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న స్కూళ్లపై చర్యలు శూన్యం
- నిద్రావస్థలో విద్యాశాఖ

వచ్చే తరాలకు అందించే గొప్ప సంపద విద్య. తమ పిల్లలకు గొప్పగా ఆస్తులను ఇవ్వలేకపోయినా ఉన్నతమైన విద్యనందిస్తే వారు జీవితాంతం హాయిగా బతుకుతారని ఆశతో తల్లిదండ్రులు పిల్లలను అప్పులు చేసి మరీ చదివిస్తుంటారు. అయితే ఇప్పుడు విద్య వ్యాపారంలా మారింది. ప్రైవేటు విద్యాసంస్థల్లో లాభార్జన ధ్యేయంగా విద్యాబోధన సాగుతుంది. ఫలితంగా విద్య ఇప్పుడు అంగట్లో వస్తువు అయింది. తల్లిదండ్రుల బలహీనతలను ఆసరాగా చేసుకుని విద్యాసంస్థలు భారీగా దోచేస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలు సైతం పట్టించుకోకుండా తల్లిదండ్రులను నిలువున దోపిడి చేస్తున్నాయి. ఇందుకు విద్య శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరియే కారణమవుతోంది.


ఓ ప్రయివేటు పాఠశాలలో విక్రయిస్తున్న పుస్తకాలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

చాలావరకు విద్యా సంస్థలు ఏటా ఫీజుల పెంపు, పుస్తకాలు, యూనిఫామ్ వంటివి అమ్మకాలే కాకుండా ఐఐటి, ఒలింపియాడ్ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధికంగా డబ్బులు వసూళ్ళ చేస్తూ లక్షలు సంపాదిస్తున్నారు. ఇటువంటి పద్ధతులకు పాల్పడకూడదని ఒక నిర్దిష్టమైన రీతిలో ఫీజులు వసూలు చేయాలని అంతకుమించి వసూలు చేయకూడదని ప్రభుత్వం చెబుతున్నా వీటిని పాటించే నాథుడే లేడు. అదీ కాక వీటిని పర్యవేక్షించాల్సిన విద్యాశాఖ అటువైపు చూడకుండా వారి ఆగడాలను మరింత ప్రోత్సహిస్తుంది. విద్యార్థుల తల్లిదండ్రులు తాము అప్పులు చేసైనా తమ పిల్లలకు చక్కటి చదువు చెప్పించాలని తపనతో కార్పోరేట్ ప్రైవేటు స్కూళ్లలో పిల్లలను చేర్పిస్తున్నారు. వారు కట్టమన్న ఫీజులను కడుతూ వారి వద్ద పుస్తకాలు, బట్టలు అధిక ధరలకు కొంటున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే దృక్పథంతో శతాబ్దాల క్రితమే ప్రభుత్వాలు జీవోలు విడుదల చేసినా విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంతో అమలు కావడం లేదు. 2005 విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేటు విద్యాసంస్థలోను 25 శాతం సీట్లను పేద పిల్లలకు కేటాయించాలి. విద్యాశాఖ అధికారులు ఈ చట్టం గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించకపోవడం విచారకరం. పైగా అనుమతులు లేని ప్రైవేటు కార్పోరేట్ స్కూల్స్ యాజమాన్యాల నుండి మండల విద్యా వనరుల కేంద్రం సిబ్బంది నెలవారి మామూళ్ల వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పట్టణంలో ఓ ప్రైవేటు స్కూలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని పట్టణానికి చెందిన పి రమణబాబు అనే వ్యక్తి స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థకు చేసిన దరఖాస్తుపై ఎస్‌కోట జూనియర్ సివిల్ జడ్జి స్కూలు యాజమాన్యాన్ని పిలిపించి అధికంగా వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి రమణ బాబుకు ఇప్పించి అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్న మిగతా ప్రైవేటు స్కూల్ లపై కూడా చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారిని కోరినప్పటికి ప్రైవేట్ స్కూళ్లపై ఏ విధమైన చర్యలూ తీసుకోలేదు.

ఎంఇఒ పట్టించుకోవటం లేదు

ప్రైవేట్ పాఠశాలలు నిబంధనల ప్రకారం పని చేస్తున్నది లేనిది పరిశీలించాల్సిన మండల విద్యాశాఖ అధికారికి ఇవేమీ తెలియవంట ఎవరైనా వెళ్లి చెబితే అవునా! అలాగా! ఎలాంటి ఫిర్యాదులు లేవే! పరిశీలిస్తాం. లిఖితపూర్వకంగా రాసి ఇవ్వండి. అని అంటున్నారు. తిరిగి మీ స్కూళ్లపై ఫిర్యాదులు చేస్తున్నారంటూ సంబంధిత పాఠశాలలకు తెలియపరుస్తున్నారు. ఇటువంటివి చేస్తే వారికి నెలవారి వచ్చే కవరు బరువు పెరుగుతుంది తప్ప సమస్య పరిష్కారం కాదు. ఫిర్యాదు చేస్తేనే పరిశీలిస్తామనే అధికారి అవసరమా? ఇకనైనా మండల విద్యాశాకాధికారి ప్రైవేట్ స్కూళ్ల ఆగడాలపై చర్యలు తీసుకోకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమ పోరాటాన్ని చేపడుతాం.

- చిన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు



కేంబ్రిడ్జి స్కూల్ అనుమతులతో నిర్వహిస్తున్న నారాయణ పాఠశాల



రవీంద్ర భారతి స్కూల్ అనుమతులతో నిర్వహిస్తున్న మినర్వా పాఠశాల

హామీల అమల్లో కూటమి విఫలం

మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఏడాది కాలంలో టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి విమర్శించారు. ఆదివారం నగరంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు కూటమి నాయకులు చంద్రబాబు నాయుడు అమలు సాధ్యం కాని హామీలిచ్చి ప్రజలను ప్రలోభపెట్టి ఓట్లు వేయించుకున్నారని దుయ్యబట్టారు. నమ్మశక్యం కానీ హామీలు ఇచ్చి బాండ్ల పేరిట ప్రజలను మోసగించారని చెప్పారు. ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో వేచి చూడగా... 2014 కాలం నాటి పరిస్థితులు పునరావతం చేశారన్న విషయాన్ని ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. ఏడాది కాలంలో స్పౌజ్ పింఛన్లు, చివరిలో తల్లికి వందనం పేరిట మరోక కార్యక్రమాన్ని అమలు చేశారే తప్ప పూర్తి స్థాయిలో ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోయారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లనున్నట్లు వెల్లడించారు.

రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీ లేకుండా చేయాలన్నదే కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యంగా పెట్టుకుందని కోలగట్ల విమర్శలు గుప్పించారు. ఇందులో భాగంగానే అవకాశం ఉన్నంత వరకు అన్యాయంగా, అక్రమంగా కేసులు బనాయించి వైసిపి నాయకత్వాన్ని బలహీన పర్చేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు.



నియోజకవర్గంలో వైసిపిని బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు సమర్థవంతమైన నాయకత్వాన్ని నియమిస్తున్నట్లు కోలగట్ల వెల్లడించారు. పార్టీ సంస్థాగత బలోపేతం కోసం నగర, మండల, గ్రామ, వార్డు స్థాయిల్లో కమిటీల నియామకాలను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేయాలనే ఆలోచన ఉన్న వారు ముందుకొస్తే వారి సమర్థతను బట్టి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. సమావేశంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శులు శెట్టి వీరవెంకట రాజేశ్వరరావు, సంగంరెడ్డి బంగారునాయుడు, ఉపాధ్యక్షులు బొద్దాన అప్పారావు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గదుల సత్యలత, జిల్లా కార్యదర్శి దుప్పాడ సునీత, వైసిపి మండల అధ్యక్షులు కెల్ల త్రినాథ్, నాయకులు డోలా మన్మథకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ

ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - కంటోన్మెంట్

పట్టణంలోని పద్మావతి నగర్‌లో ఆదివారం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా మరొక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో నగరంలోని నటరాజ్ కాలనీకి చెందిన పేడాడ నూకరాజు (41) అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పేడాడ నూకరాజు ఉదయం ధర్మపురి వెళ్ళి తిరిగి ఇంటికి వస్తుండగా అదే మార్గంలో ఎదురుగా వచ్చిన విశాఖకు చెందిన దుర్గా గణేష్ బైకులు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. గాయపడిన ఇద్దరినీ ఆస్పత్రికి తరలించగా నూకరాజు అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన గణేష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నూకరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించారు. విజయనగరం రూరల్ ఎస్ఐ వి.అశోక్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనా స్థలంలో ప్రమాదానికి గురైన బైక్‌లు

ఎస్ఐ మురళిపై చర్యలు తీసుకోండి

జర్నలిస్ట్ నాయుడుకు సంఘీభావం తెలిపిన అయ్యప్పనగర్ కాలనీవాసులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సీనియర్ జర్నలిస్ట్ ఎంఎంఎల్ నాయుడుపై విజయనగరం టూ టౌన్ ఎస్ఐ మురళి చేసిన దౌర్జన్యాన్ని నగరంలోని అయ్యప్పనగర్ కాలనీ పోరాట సమితి తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆదివారం పలువురు కమిటీ సభ్యులు జర్నలిస్ట్ నాయుడుని కలిసి తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ అయ్యప్పనగర్‌లో నివాసం ఉంటున్న రిటైర్డ్ డిఇఒ ఎస్.అప్పలనాయుడుపై జరిగిన హత్యాయత్నానికి సంబంధించి జర్నలిస్ట్ నాయుడు తన మొబైల్ ఫోన్‌లో విజువల్స్ తీస్తుండగా, టూ టౌన్ ఎస్ఐ మురళి దౌర్జన్యం చేసి ఫోన్ లాక్కున్నారని తెలిపారు. అంతటితో ఆగకుండా తీవ్ర పదజాలంతో దుర్భాషలాడారని, ఇలా, ఒక పోలీస్ అధికారి సీనియర్ జర్నలిస్టుపై దౌర్జన్యం చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. వెంటనే ఎస్ఐ మురళిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే జర్నలిస్ట్ నాయుడుకు మద్దతుగా పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అయ్యప్పనగర్ కాలనీ పోరాట కమిటీ అధ్యక్షులు సుదర్శనరావు, సెక్రటరీ ఎన్.సుధీర్, యు.ఎస్.రవికుమార్ (సిఐటియు నగర కోశాధికారి), అచ్యుతాంబ (హ్యూమన్ రైట్స్ కమిటీ సభ్యులు), ఎం.మోహన్‌రావు (న్యాయవాది), కె.వరప్రసాద్, ఆదినారాయణరావు, శ్రీనివాసరావు సంతోష్, మహేష్, నారాయణరావు పాల్గొన్నారు.

కేన్సర్ మృతుల కుటుంబాలకు

రూ.25 లక్షలు చెల్లించాలి

(మొదటి పేజీ తరువాయి)

మరిచర్ల మహాలక్ష్మిని పరామర్శించారు. అనంతరం గ్రామంలో గంగునాయుడుతో పాటు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తిరుపతిరావు విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో వివిధ రకాల కేన్సర్ బారినపడి 12మంది మృతి చెందారని అన్నారు. ఇంకా అనేక మంది ఈ వ్యాధితో బాధపడే పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికే పంచాయతీ పరిధిలో గల ఎంపిటిసి, కొంతమంది రైతులు, సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గత 15 రోజుల నుంచి జిల్లాస్థాయి వైద్య సిబ్బందికి, వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పూర్తిస్థాయిలో స్పందన లేదన్నారు. కేవలం వైద్య సిబ్బంది వచ్చి ముగ్గురికే కేన్సర్ ఉందని చెప్పి తూతూ మంత్రంగా దర్యాప్తు చేసి వెళ్లిపోయారు తప్ప పూర్తి స్థాయిలో గ్రామస్తులకు గానీ, రైతులకు గాని అవగాహన కల్పించకపోవడం దారుణమన్నారు. ఈ గ్రామంలో ఏడేళ్ల క్రితం నిర్మించిన పురుగుల మందు ఫ్యాక్టరీ వల్ల కూడా కొంతవరకు ఈ వ్యాధులు వస్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారన్నారు. ఈ పురుగుల మందు పరిశ్రమ అతి తక్కువ యానిట్‌తో నిర్మించారని, ఇపుడు దీనికి మించి ఇక్కడ ఉత్పత్తి చేసే పరిస్థితి ఉందని అన్నారు. ఇలాంటి సందర్భంలో చుట్టుపక్కల రైతులు తమ పొలానికి వెళ్లే సందర్భంలో బోర్లలో నీళ్ల తాగేటప్పుడు విపరీతమైన చెడు వాసన వస్తుందన్నారు. ఫ్యాక్టరీ పక్క నుంచి పొలాలకు వెళ్లేటప్పుడు కూడా దుర్వాసన వస్తుందన్నారు. దీనివల్ల చుట్టుపక్కల రైతులు తమ పొలాల్లో పనిచేయలేకపోతున్నారని తెలిపారు. ఆఖరుకు కూలీలు కూడా పొలం పనులకు రాని పరిస్థితి ఉందని ఈ విషయాన్ని రైతులు తమకు స్వయంగా తెలియజేశారని తెలిపారు. కాబట్టి ఇలాంటి సందర్భంలో పూర్తిగా ఫ్యాక్టరీకి అనుమతులు ఉన్నాయా? లేదా? ఎంతవరకు అనుమతులు ఇచ్చారు ఆ అనుమతులు మించి ఏమైనా పురుగుల మందులు తయారు చేస్తున్నారా? కాలుష్య నియంత్రణాధికారులు ఎంతవరకు అనుమతులు ఇచ్చారు అనుమతికి మించి ఏమైనా ఈ ఫ్యాక్టరీ యాజమాన్యం పురుగుల మందులు తయారు చేస్తున్నారా అన్న విషయాన్ని కూడా పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. వీటన్నింటి పైనా పూర్తి స్థాయిలో అనుభవం కలిగిన నిపుణులను రప్పించి వారి ద్వారా దర్యాప్తు చేపట్టాలని, అలాగే ఇప్పటికే ఎవరైతే కేన్సర్ చనిపోయారో వారి కుటుంబాన్ని అన్ని విధాలా రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో గ్రామానికి చెందిన ప్రజలు, రైతులు చేస్తున్న పోరాటానికి సిపిఎం మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ విషయంపై జిల్లా నుంచి అమరావతి వరకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, స్థానిక ఎంపిటిసి సభ్యులు జి.వెంకటనాయుడు, బాధిత కుటుంబ సభ్యులుపాల్గొన్నారు.

ఇంతకీ ఆయన ఏ పార్టీ?

(మొదటి పేజీ తరువాయి)

వెనకేసుకురావడం, ప్రస్తుతం అతనితో సంబంధం లేదంటూ ఇరు పార్టీలు చెప్తుండడం జనంలో చర్చనీయాంశంగా మారింది. ఆయన ఎవరో కాదు.. మన జిల్లాలో శృంగవరపుకోట ప్రాంతానికి చెందిన ఇందుకూరి రఘురాజు.

ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న ఇందుకూరి రఘురాజు శృంగవరపుకోట కేంద్రంగా తన రాజకీయ కార్యకలాపాలు మొదలుపెట్టారు. గడిచిన ఎన్నికలకు ముందు వరకు వైసిపిలో ఉన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఆ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవి కూడా కట్టబెట్టారు. కానీ, స్థానిక ఎమ్మెల్యేతో విభేదాలు మొదలు, చివరికి పార్టీకి నష్టం జరిగే విధంగా వ్యవహరించారన్న కారణంతో వైసిపి గత ఏడాది ఎన్నికల ముందు ఆయన్ను సస్పెండ్ చేసింది. ఎమ్మెల్సీ పదవిని ఊడదీసేందుకు కూడా ప్రయత్నించినప్పటికీ న్యాయ పోరాటంతో పదవీ గండం నుంచి బయట పడ్డారు. ఈ పదవి కోసం టిడిపిలో ఆయన చేరకపోయినప్పటికీ తన భార్య సహా ఆనుయాయులందర్నీ సైకిల్ ఎక్కించేశారు. తీరా టిడిపి అధికారంలోకి వచ్చాక ఆ పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నారన్న ఆరోపణలతో కొద్దికాలంగా రఘురాజును పక్కనపెట్టారు. నాలుగు రోజుల క్రితం వరకు ఈ వ్యవహారం అంతర్గతంగా సాగినప్పటికీ ఇటీవల నిర్వహించిన పత్రికా సమావేశంలో టిడిపికి చెందిన డిసిఎంఎస్ చైర్మన్ మాట్లాడుతూ రఘురాజుకు, తమ పార్టీకి సంబంధం లేదని, ఆయన భార్య మాత్రమే తమ పార్టీలో ఉన్నారని కుండ బద్దలు కొట్టినట్టు చెప్పేశారు. అంతే కాదు.., ఆయన వైసిపి ఎమ్మెల్సీ.. అంటూ కూడా సంబోధించారు. దీంతో, ఆయన ఏ పార్టీలో ఉన్నట్టు? అంటూ జనంలో చర్చ మొదలైంది.

వాస్తవానికి రఘురాజుకు రాజకీయ సిద్ధాంతం అంటూ ఉందా? లేదా? అనేది పక్కనబెడితే, ఆయన రాజకీయ చరిత్రలో మొత్తం నాలుగు పార్టీలు మారారు. తొలుత కాంగ్రెస్‌లో పనిచేసేవారు. అక్కడ తగిన స్థానం దక్కలేదన్న నెపంతో బిజెపిలో చేరారు. ఆ తరువాత వైసిపిలోకి వచ్చారు. అక్కడ ఎమ్మెల్సీ పదవి దక్కినప్పటికీ, గడిచిన ఎన్నికల్లో ఎమ్మెల్యే కడుబండికి టికెట్ ఇవ్వవద్దని ఏకంగా అధినేతకే కండిషన్ పెట్టడంతో పక్కనబెట్టేశారు. నష్టం కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారంటూ ఏకంగా పార్టీ నుంచి తొలగించారు. ఆ తరువాత టిడిపిలో టెక్నికల్‌గా చేరకపోయినా, వైసిపి హవాను అడ్డుకునేందుకు ఆ పార్టీకి పరోక్షంగా సహకరించారు. తాజాగా టిడిపికి వ్యతిరేకంగా ఉన్నారన్న అనుమానంతో ఈ పార్టీకి చెందిన నాయకులు కూడా దరి చేరనీయడం లేదు. దీంతో, ఇంతకీ రఘురాజు ఏ పార్టీలో ఉన్నట్టు? అంటూ నెటిజన్లు సెటైర్లు వేస్తున్నారు.

విద్యా హక్కు చట్టానికి తూట్లు

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభానికి ముందే అధికారులు ఆదేశించినా ఆయా పాఠశాలలు మాత్రం లెక్క చేయట్లేదు. అడ్మిషన్ ఇవ్వని పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని అధికారులు ప్రకటనలిస్తున్నా వారిలో మాత్రం ఎలాంటి స్పందన కనిపించట్లేదు. నగరంలో పేరొందిన ఓ ప్రైవేటు పాఠశాలల సీట్లు పొందిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆయా పాఠశాలలకు రిపోర్ట్ చేద్దామని వెళ్లగా ముందు ఫీజు డబ్బులు చెల్లిస్తే తప్ప చేర్చుకోబోమని చెప్పడంతో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నగరంలోని దాదాపుగా అన్ని ప్రైవేటు పాఠశాలల్లో అరకొరగా అడ్మిషన్లు ఇస్తున్నారు. మరికొన్ని పాఠశాలలు ఏదో కారణం చూపి వెనక్కి పంపించేస్తున్నారు. దీంతో జిల్లాలో 1146 మంది అర్హులను గుర్తిస్తే వారిలో రకరకాల కారణాలు చెప్పి 193 మందికి అవకాశం కల్పించలేదు. దీంతో వారంతా విద్యా శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

జిల్లాలో 2025-26 విద్యా సంవత్సరానికి మొదటి దశగా 1146 సీట్లు ప్రభుత్వం ఆర్‌టిఇ కింద ఉచితంగా మంజూరు చేసింది. ఆయా విద్యార్థులను జూన్ 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా అడ్మిషన్ ఇవ్వాల్సి ఉంది. అయితే 947 మందికి మాత్రమే సీట్లు ఇచ్చినట్లు తెలిసింది. మిగిలిన వాటిలో 193 మందికి అసలు సీట్లు ఇస్తారా....? లేదా..? అనే విషయం తేల్చకుండా యాజమాన్యాలు పెండింగ్‌లో పెట్టాయి. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులే అమలు కాకపోవటంతో తల్లిదండ్రులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొందరు విద్యార్థులకు సమాచారం సరిగా లేకపోవటం, తల్లిదండ్రులు రిపోర్ట్ చేకపోవటంతో కొన్ని సీట్లు భర్తీ చేయలేదు. అడ్మిషన్ ఇవ్వని పాఠశాలల్లో కార్పొరేట్, పెద్దపెద్ద ప్రైవేటు విద్యా సంస్థలే ఎక్కువగా ఉన్నాయి. మొదటి విడతలో 193 అడ్మిషన్లు భర్తీ కాలేదు సరికదా, రెండో విడతలో 630 సీట్లు భర్తీ కావాల్సి ఉంది. ఈ 630 సీట్లు అడ్మిషన్లు పూర్తి స్థాయిలో జరుగుతాయా లేదా అనేది జూన్ పూర్తయిన వెంటనే తేలనుంది.

ఫీజుల సమస్య

ఉచిత సీట్లకు సంబంధించి యాజమాన్యాలు ఫీజుల విషయంలో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ప్రభుత్వం ఇస్తున్న ఫీజులు సరిపోవట్లేదనే వాదన ముందుకు తీసుకొస్తున్నాయి. కార్పొరేట్ స్కూల్స్, పెద్ద పెద్ద స్కూల్స్ రూ.35 వేలకుపైగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. వాస్తవానికి విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి పాఠశాలలో 25 శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలి. అయితే ప్రభుత్వం కొంతమేర ఫీజులు చెల్లిస్తున్నా యాజమాన్యాలు సీట్లు ఇచ్చే విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో 2024-25 అడ్మిషన్ల విషయంలో తీవ్ర గందరగోళం ఏర్పడింది. అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ప్రభుత్వం ఫీజులు జమ చేయకపోవటంతో యాజమాన్యాలు విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశాయి. దీనిపై పెద్ద సంఖ్యలో ప్రభుత్వానికి ఫిర్యాదులు కూడా వెళ్లాయి. తల్లిదండ్రుల నుండి ఫీజులు వసూలు చేశాయి. పెండింగ్ ఫీజులు రావాల్సి ఉందని, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఫీజుల విషయంలో కూడా స్పష్టత కోసమే యాజమాన్యాలు అడ్మిషన్లు తిరస్కరిస్తున్నాయని తెలుస్తుంది. ప్రభుత్వ ఆదేశాలను పక్కన పెట్టి ఫీజుల కోసం అడ్మిషన్లు నిలిపివేయటంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం స్పందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

కాలువలో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని జనార్ధనవలస గ్రామంలో గుల్లిపల్లి సత్యనారాయణ(31) ఆదివారం ఉదయం బహిర్భూమికి కాలువకు వెళుతుండగా ఫిట్స్ వచ్చి కాలువలో పడి మృతి చెందాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాగర్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీని ఢీకొని యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి-బొబ్బిలి

లారీని ఢీకొని యువకుడు దుర్మరణం చెందాడు. పాతబొబ్బిలి నుంచి బొబ్బిలి ద్విచక్ర వాహనంపై వస్తున్న యువకుడు.. భారత్ పెట్రోల్ బంకు వద్ద లారీని ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించాడు. సంఘటన జరిగిన వెంటనే ట్రాఫిక్ ఎస్ఐ జ్ఞానప్రసాద్ చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిహెచ్‌సికి తరలించారు. మృతుడి వివరాలు పోలీసులు సేకరిస్తున్నారు.



మృతిచెందిన యువకుడు

లారీ అదుపు తప్పి బోల్తా

కేబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్

ప్రజాశక్తి - కంటోన్మెంట్

జామి మండలంలోని అలమండ సమీపంలో ఉన్న బ్రిడ్జ్ ఎడమవైపు శనివారం అర్ధరాత్రి లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ క్యాబిన్‌లో చిక్కుకుపోగా క్లినర్‌కు గాయాలయ్యాయి. డ్రైవర్‌ను క్యాబిన్ నుంచి అతి కష్టం మీద బయటకు తీశారు. ఈ లారీ విజయనగరం నుంచి హైదరాబాదుకు ఇనుప స్క్రాప్ సమాన్లతో వెళ్తోంది. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు.

వివాహిత అదృశ్యం

ప్రజాశక్తి - సంతకవిటి

వివాహిత అదృశ్యంపై కేసు నమోదైనట్లు ఎస్ఐ గోపాలరావు తెలిపారు. మండలంలోని బలరాంపేట గ్రామానికి చెందిన సింగుపురపు అప్పలరాం సోదరి సుగుణకు శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలం డోల గ్రామానికి చెందిన ఎన్ని అప్పలనాయుడుతో వివాహమైంది. వీరికి ఎనిమిదేళ్ల వయసున్న కుమార్తె ఉంది. కుటుంబ సమస్యల కారణంగా భర్త ఇంటి నుంచి కుమార్తెతో బలరాంపేటలోని కన్నవారింటికి చేరుకుంది. కుటుంబంలో సమస్యలు నానాటికీ పెరుగుతుండటంతో మనస్తాపానికి గురై కన్నవారింటి నుంచి ఈ నెల 26న ఆమె బయటకు వెళ్లిపోయింది. ఆరోజు నుంచి కనిపించడం లేదని ఆమె సోదరుడు అప్పలరాం పోలీసులకు ఫిర్యాదుచేశాడు. కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

1200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని చిన్న బెత్తపురంలో1200 లీటర్లు పులిసిన బెల్లం ఊటలను ఎస్ఐ వై.అమ్మనరావు ఆదివారం పట్టుకొని వాటిని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా తయారు చేసినా, విక్రయించినా, శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సారా తయారీకి ముడి సరుకు పంపిణీ చేసినా కేసులు తప్పవన్నారు. సారా నిర్మూలనకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

'ఫోర్జరీ' కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - కంటోన్మెంట్

వ్యాపార వ్యవహారాల్లో ఇన్ వాయిస్ లెటర్ హెడ్‌లు తయారీ చేసి ఫోర్జరీ సంతకాలు చేసి మోసం చేసిన కేసులో వ్యక్తి ని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సి.ఐ.ఎస్.శ్రీనివాస్ తెలిపారు. పట్టణానికి చెందిన కర్రి రవీంద్ర రెడ్డి శ్రీ వెంకటేశ్వర వాహ న యార్డ్ పేరుతో 13 సంవత్సరాలుగా సంస్థ నిర్వహిస్తున్నాడు. చెన్నైకు చెందిన ఎం ఎఫ్‌సిడబ్ల్యుఎల్ కంపెనీతో 2017 నుండి అగ్రిమెంట్ చేసుకుని వ్యాపారం చేస్తున్నారు. ఆ సంస్థలో పని చేసే తమిళనాడుకు చెందిన జి.జె. శ్రీనివాసులు, రవీంద్ర రెడ్డికి చెందిన ఇన్ వాయిస్‌లు, లెటర్ హెడ్‌లు తయారీ చేసి ఫోర్జరీ సంతకాలు చేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి జి.జె శ్రీనివాసులను అరెస్ట్ చేసినట్లు సిఐ తెలిపారు


కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

సంపూర్ణ మద్య రహిత గ్రామంగా సారిపల్లి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సారిపల్లిని సంపూర్ణ మద్యం రహిత గ్రామంగా తీర్చి దిద్దాడానికి సహకరించాలని సర్పంచ్ రాయి పైడమ్మ, ఎంపిటిసి మజ్జి త్రివేణి కోరారు. ఆదివారం వారు, గ్రామస్థులు సంపూర్ణ మద్యం నిషేధం కోసం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పైడమ్మ, ఎంపిటిసి త్రివేణి మాట్లాడుతూ గ్రామంలో మద్యం నిషేదానికి అన్ని వర్గాలూ సహకరించాలని కోరారు. అసిరి తల్లి గుడి, కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం పార్టీల కతీతంగా రిజర్వాయర్ గట్టు కట్టడాన్ని వ్యతిరేకిస్తూ అందరూ సమావేశం నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో గుడి, కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ఇసుక, మద్యం అమ్మకాలకు నిర్ణయం జరిగిందని దీనిలో మద్యాన్ని వ్యతిరికించామని చెప్పారు. కాబట్టి గ్రామంలో ఎటువంటి మద్యం అమ్మకాలూ జరపవద్దని అన్ని షాప్‌ల యజమానులను కోరుతున్నామని తెలిపారు. కాగా గతంలో సంపూర్ణ మద్యం రహిత గ్రామంగా ప్రకటించామని దీనికి గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం మద్య నిషేదంపై కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రాయి విభీషణరావు, నడిపేన ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విద్యార్థులకు మేలు

ప్రజాశక్తి - తెర్లాం

పుస్తకపఠనంతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతోందని శాఖా గ్రంథాలయ అధికారి కృష్ణమూర్తి అన్నారు. శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులతో పుస్తకాలు, ఇతిహాసాలు, నీతి కథలు, ఆధ్యాత్మిక, అమృతవాహిని పుస్తకాలను చదివించామన్నారు. ఈ పుస్తకాలతో మంచి విజ్ఞానం భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలు తెలుస్తాయని ఈ సందర్భంగా తెలిపారు. చిల్డ్రన్స్ క్లబ్‌లో భాగంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి- డెంకాడ

భోగాపురం మండల జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం ముక్కాం వైసిపి సీనియర్ నాయకులు వాసుపల్లి దాసు, అనంత్, సొసైటీ అధ్యక్షుడు మైలపల్లి ధనరాజ్‌తో పాటు సుమారు 40 కుటుంబాల నుంచి 80 మంది వైసిపి నుంచి జనసేనలో చేరారు. వీరికి ఎమ్మెల్యే లోకం నాగ మాధవి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో భోగాపురం మండల కోఆర్డినేటర్ పల్లంట్ల జగదీష్, పడాల శ్రీనివాస్, గూడుపువలస సర్పంచ్ మట్ట అయ్యప్ప రెడ్డి, ముక్కాం జనసేన నాయకుడు జి.కే తదితరులు పాల్గొన్నారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

సమ్మెను జయప్రదం చేయండి

- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ పిలుపు
- 18 మందితో సిఐటియు నగర నూతన కమిటీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జులై 9న చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని ఎన్‌పిఆర్ భవన్‌లో సిఐటియు నాలుగో నగర మహాసభను ఎ.జగన్మోహనరావు అధ్యక్షతన నిర్వహించారు. తొలుత యూనియన్ జెండాను నగర ఉపాధ్యక్షులు రెడ్డి శంకర్రావు ఆవిష్కరించారు. అనంతరం మహాసభలో సుబ్బరావమ్మ మాట్లాడుతూ కార్మిక వర్గంపై కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు పెద్ద ఎత్తున దాడి చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిటిష్ కాలం నాడు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కార్పొరేట్ శక్తులకు, యాజమాన్యాలకు అనుకూలంగా 4 కోడ్లు రూపంలో అమలుకు పూనుకున్నాయని, కార్మిక శాఖను పూర్తిగా నిర్వీర్యం చేశాయని మండిపడ్డారు. కార్మిక శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పరిశ్రమల్లో కార్మికులకు భద్రత లేదని, తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని, అందుకు ప్రభుత్వ విధానాలే కారణమని ధ్వజమెత్తారు. 2012 నుంచి కనీస వేతనాల సవరణ జరగలేదని, బోర్డును కూడా వేయలేదని, జాతీయ కనీస వేతనం 178 రూపాయలే అమలు చేస్తామని కేంద్రంలో మోడీ ప్రభుత్వం నిర్ణయించిందని దుయ్యబట్టారు. ఒకే దేశం ఒకే ఎన్నిక అంటున్న బిజెపి ప్రభుత్వం, దాన్ని బలపరుస్తున్న రాష్ట్రంలోని కూటమి ప్రభు త్వం... ఒకే రకమైన పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఎందుకు జీతం ఇవ్వడం లేదని ప్రశ్నించారు. నైట్‌షిఫ్ట్‌లో మహిళలతో పనికి అనుమతి ఇచ్చిన ప్రభుత్వం వారికి కనీస వేతనం, పని భద్రత, గ్రాట్యూటీ, పెన్షన్‌తో కూడిన రిటైర్మెంట్ బెనిఫిట్ ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. ఉపాధి లేక, ధరలు పెరిగి సామాన్యులు విలవిల్లాడుతుంటే మోడీ, బాబు యోగా చేస్తున్నారని విరుచుకుపడ్డారు. పేదరిక నిర్మూలన, ధరలు తగ్గింపు, ఉపాధి కల్పనపై పాలకులు దృష్టి పెట్టాలని కోరుతూ చేపట్టే సమ్మెలో సంఘాలతో నిమిత్తం లేకుండా యావత్ కార్మిక వర్గం, రైతాంగం భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.



సభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ 8 గంటల పని దినాన్ని 10 గంటలకు టిడిపి కూటమి ప్రభుత్వం పెంచితే, దానిపై వైసిపి పల్లెత్తు మాట్లాడకపోవడం వారి వర్గ దృక్పథానికి నిదర్శనమన్నారు. సిఐటియు నగర ఉపాధ్యక్షులు రెడ్డి శంకర్రావు మాట్లాడుతూ నగరంలో కార్మిక వర్గ సమస్యల మీద పోరాడే బలమైన శక్తిగా సిఐటియు విస్తరణకు నూతన కమిటీ కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం సిఐటియు నగర కార్యదర్శి ప్రవేశపెట్టిన రిపోర్టును మహాసభ ఆమోదించింది.

అధ్యక్ష, కార్యదర్శులుగా ఎ.జగన్‌మోహన్‌రావు, బి.రమణ

ఈ సందర్భంగా 18 మందితో సిఐటియు నగర నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్ష కార్యదర్శులుగా ఎ.జగన్మోహనరావు, బి.రమణ, కోశాధికారిగా యుఎస్ రవికుమార్, ఉపాధ్యక్షులుగా రెడ్డి శంకర్రావు, సహాయ కార్యదర్శులుగా కె.ప్రభ, ఎస్.రామనాయుడు, సభ్యులుగా మహాలక్ష్మి, బి భాస్కరరావు, సునీత, స్వప్న, నందిని, సురేష్, అప్పారావు, సత్యం, సురేష్, రాజు, లక్ష్మి ఎన్నికయ్యారు.

కాలంచెల్లిన మందులను అమ్మితే చర్యలు

- జిల్లాలో 1460 మెడికల్ షాపులు
- వైద్యుల చీటీ లేకుండా యాంటీబయోటిక్స్ అమ్మరాదు
- ప్రజాశక్తితో జిల్లా ఔషధ నియంత్రణ శాఖ ఎడి కె.రజిత ముఖాముఖి

కాలం చెల్లిన మందులను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.రజిత హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా రిటైల్ మెడికల్ షాపులు 1060 ఉండగా, హోల్‌సేల్ షాపులు 400 వరకు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి మెడికల్ షాపులో ఫార్మాసిస్ట్ ఉండాలన్నారు. ఫార్మాసిస్ట్ లేకుంటే షాపులను తనిఖీ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో విజయనగరం, బొబ్బిలి సబ్ డివిజన్ కార్యాలయాలు ఉన్నాయని, ఇందులో ఇద్దరు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారని చెప్పారు. యాంటి బయోటిక్ మందులు వైద్యుల చీటీ లేకుండా అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆమె ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

- ప్రజాశక్తి, కంటోన్మెంట్

జిల్లాలో ఎన్ని మెడికల్ షాపులు ఉన్నాయి.?

విజయనగరం జిల్లా వ్యాప్తంగా రిటైల్ మెడికల్ షాపులు 1060 ఉన్నాయి. హోల్‌సేల్ షాపులు 400 వరకు ఉన్నాయి. వాటి ద్వారా రోగులకు మందులను అందిస్తున్నారు.


మెడికల్ షాపు ఏర్పాటు చేయాలంటే నిబంధనలు ఏమిటి.?

మెడికల్ రిటైల్, హోల్‌సేల్ షాపులు ఏర్పాటు చేయాలంటే ప్రొప్రైటర్ వివరాలు, ఐడెంటిటీ కార్డు, ఫార్మాసిస్ట్ ఐడెంటిటీ, భవన యజమాని అంగీకార పత్రంతోపాటు కచ్చితంగా 10 చదరపు మీటర్ల గది ఉండాలి. ఈ నిబంధనలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ఆ షాప్ పెట్టుకున్న ప్రాంతాల్లో ఉన్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వెళ్లి తనిఖీ చేస్తారు. అన్ని ధ్రువపత్రాలు సక్రమంగా ఉంటే, మెడికల్ షాప్ ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇస్తాం. మెడికల్ షాప్‌లో ఫ్రిడ్జ్ కచ్చితంగా ఉండాలి.



కాలం చెల్లిన మందులు వాడితే ఎటువంటి చర్యలు తీసుకుంటారు.?

మెడికల్ షాపుల్లో కాలం చెల్లిన మందులను అమ్మడానికి, కొనుగోలు చేయడానికి వీలు లేదు. అటువంటివి ఏ మెడికల్ షాపులో విక్రయిస్తే మాకు ఫిర్యాదు చేయాలి. స్పందించి ప్రత్యేక తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదులు, సమాచారం అందిస్తే అటువంటి వారిపై ప్రత్యేక దాడులు నిర్వహించి షాపులను రద్దు చేసే అవకాశాలు కూడా ఉంటాయి.



జిల్లాలో చాలా మెడికల్ షాపుల్లో ఫార్మాసిస్ట్‌తో కాకుండా సాధారణ వ్యక్తులతో మందులు అమ్ముతున్నారన్న విమర్శలు ఉన్నాయి.?

మెడికల్ షాపుల్లో ఫార్మాసిస్ట్ ఉండాలన్నది తప్పసరి నిబంధన. ప్రధానంగా యాంటిబయోటిక్ మందులు ఇచ్చే సమయంలో ఫార్మాసిస్టు ఉండాలి. వైద్యుల చీటీ లేకుండా యాంటీబయోటిక్ మందులు ఇవ్వరాదు. కచ్చితంగా ఈ నిబంధనలను మెడికల్ షాపులు పాటించాలి.

ఇన్‌స్పెక్టర్లు నెలకు ఎన్ని తనిఖీలు నిర్వహించాలి.?

జిల్లాలో విజయనగరం, బొబ్బిలి ప్రాంతాల్లో రెండు ఇన్‌స్పెక్టర్ కార్యాలయాలు ఉన్నాయి. విజయనగరంలో ఇన్‌స్పెక్టర్ లలిత, బొబ్బిలిలో ఇన్‌స్పెక్టర్ లావణ్య ఆధ్వర్యంలో మెడికల్ షాపులపై తనిఖీలు నిర్వహిస్తున్నాం. ప్రతి ఇన్‌స్పెక్టర్ పరిధిలో నెలకు 40 షాపులను కచ్చితంగా తనిఖీలు చేయాలి. నిబంధనలు పాటించని మెడికల్ షాపులు, హోల్‌సేల్ షాపులపై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటాం. విజయనగరం జిల్లా కేంద్రంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం సొంత భవనం. బొబ్బిలిలో అద్దె భవనంలో నిర్వహిస్తున్నాం.

గత మూడేళ్లలో జిల్లా వ్యాప్తంగా ఎన్ని తనిఖీలు చేపట్టారు.?

జిల్లాలో గత మూడేళ్లలో రిటైల్, హోల్‌సేల్ మెడికల్ షాపుల్లో తనిఖీ చేశాం. 2022-23లో 751 మెడికల్ షాపుల్లో తనిఖీలు చేయగా, 198 మెడికల్ షాపులు నిబంధనలు పాటించనట్లు గుర్తించి, కేసులు నమోదు చేశాం. 7 షాపులపై కోర్టులో ఫిర్యాదు చేశాం. 2023-24లో 1012 షాపులపై తనిఖీలు చేశాం. 237 షాపులు నిబంధనలు పాటించకపోవడం కేసులు నమోదు చేశాం. 5 షాపులపై కోర్టుకు ఫిర్యాదు చేశాం. 2024-25లో 1001 మెడికల్ షాపులను తనిఖీ చేయగా 248 మెడికల్ షాపులు నిబంధనలు పాటించలేదు. దీంతో కేసులు నమోదు చేశాం. ఒక మెడికల్ షాపుపై కోర్టులో ఫిర్యాదు చేశాం.

గజ..గజ..

- బీభత్సం సృష్టిస్తున్న ఏనుగుల గుంపు
- పొలాలు, పశువుల షెడ్లు, ధాన్యం గోడౌన్లు ధ్వంసం
- భయాందోళనలో ప్రజలు
- పట్టించుకోని అటవీశాఖ అధికారులు

అడవుల్లో సంచరించాల్సిన గజరాజులు ప్రస్తుతం గ్రామ పొలాల్లో తిష్ట వేసి వివిధ పంట చేలు, పశువుల షెడ్లు, ధాన్యం గోడౌన్‌లు, వివిధ పరికరాలను ధ్వంసం చేయడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామ వీధుల్లోకి చొరబడి దాడి చేస్తాయేమోనని ప్రజలు భయపడు తున్నారు. రాత్రీ పగలు కంటి మీద కునుకు లేకుండా ఏనుగులు ఎప్పుడు వచ్చి ఏం చేస్తా యోనని బితుకుబితుకు మంటూ బతుకు తున్నారు. అటవీ శాఖ అధికారులు జోక్యం చేసుకొని గజరాజులను అటవీ ప్రాంతానికి తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాశక్తి- వంగర

మండలంలోని మరువాడలో ఈనెల 25న ప్రవేశించిన గజరాజులు అక్కడ నుండి నీలయ్యవలస, జగన్నాథవలస, మడ్డువలస గ్రామాల్లో సంచరించి మొక్కజొన్న చేలు, వరి నార్లు, పంటలతో పాటు వివిధ రకాల పరికరాలను ధ్వంసం చేస్తున్నాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగన్నాథవలస పడాలరాజుకు చెందిన గ్రామ సమీపంలో ఉన్న మొక్కజొన్న చేను, పశువుల రేకుల షెడ్డు అదే షెడ్డులో ఉన్న వివిధ రకాల పరికరాలు ధ్వంసం చేశాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మడ్డువలసలో బూరాడ వెంకటరావుకు చెందిన గోడౌన్‌లో ఉన్న ధాన్యం, గోడౌన్‌ను, ధ్వంసం చేశాయని తెలిపారు. అదే గ్రామంలో బూరాడ విష్ణు, నరసయ్య, నాయుడు, కృష్ణ, విష్ణులకు చెందిన నారు మడులను గజరాజులు ధ్వంసం చేశాయని ఈనెల 27న రాత్రి 7గంటల సమయంలో గ్రామంలోకి ఏనుగులు చొర పడడంతో భయాందోళన చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గజరాజులు అక్కడ నుండి వంగర మండలానికి సరిహద్దు గ్రామమైన రేగిడి మండలం సరసానపల్లి వెళ్లిపోయినప్పటికీ మరలా అక్కడ నుండి తిరిగి వంగర మండలంలోని సంగాం గ్రామ పొలాల్లోకి ఆదివారం చేరుకుని తిష్ట వేశాయి. ఈ గ్రామ పొలాలలో ప్రస్తుతం చెరకు, మొక్కజొన్న, తేగలు, వరినార్లు వేసి ఉన్నాయి. బొడ్రోతు కృష్ణ, బొడ్రోతు పకీరు, బొడ్రోతు కూర్మినాయుడు, బోను ఆనంద్, కనకల త్రినాధనాయుడు, కలనక నరసింహమూర్తి, కనకల ఎర్రమనాయుడు, బోను నాగరాజులకు చెందిన పామాయిల్, తేగలు, చెరకు, వరినారు మడులను ధ్వంసం చేశాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే గ్రామంలో గజరాజులు గతేడాది ఆగస్టు నెలలో వచ్చి ఎక్కువ రోజులు ఇక్కడే తిష్ట వేసి పంటలు ధ్వంసం చేయడంతో పాటు, పాడి పసువులపై దాడి చేసిన ఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం గజరాజులు సంగాంలో తిష్ట వేయడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్న పరిస్థితి ఉంది. పంటలు ధ్వంసం అయ్యాయని అటవీ శాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోవటం లేదని పలు గ్రామాలకు చెందిన రైతులు ఆవేదన చెందుతున్నారు.



మొక్కజొన్న పంటను ధ్వంసం చేశాయని చెబుతున్న రైతు

గతసారి కొందరికే నష్టపరిహారం

గతేడాది ఆగస్టు నెలలో ఇవే గజరాజులు మండలంలోని బాగేంపేట, నీలయ్యవలస, మడ్డువలస, సంగాం, శివ్వాం, తలగాం తదితర గ్రామాలలో సంచరించి తిష్ట వేసి వివిధ రకాల పంటలతో పాటు, ధాన్యం, షెడ్లు తదితర వాటిని ధ్వంసం చేశాయి. అయితే వాటికి సంబంధించి అటవీ శాఖ అధికారులు పంట నష్టపరిహార చెక్కులను ఇటీవల కొంతమంది రైతులకు స్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. అయితే మరి కొంతమంది రైతులు నష్టపరిహారానికి సంబంధించి రెవెన్యూ అధికారులతో సంతకాలు చేయించి దరఖాస్తు పెట్టినప్పటికీ ఇంత వరకు నష్టపరిహారం అందజేయలేదని, అటవీ శాఖ అధికారులు తీరును విమర్శిస్తున్నారు.



శివ్వాంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

ప్రభుత్వం ఆదుకోవాలి

గజరాజులు ప్రస్తుతం మండలంలో పలు గ్రామాలలో సంచరించి తిష్ట వేస్తున్నాయి. దీంతో వివిధ రకాల పంటలు ధ్వంసం చేస్తున్నాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

దరఖాస్తు పెట్టినా పరిహారం ఇవ్వలేదు

గత ఆగస్టు నెలలో ఏనుగులు మా గ్రామానికి వచ్చి మా 85 సెంట్లు చెరకు పొలం ధ్వంసం చేశాయి. దీనికి సంబంధించి రెవెన్యూ అధికారులతో సంతకాలు చేయించి ఆధారాలతో అటవీ శాఖ అధికారులకు దరఖాస్తు అందజేసినప్పటికీ నష్టపరిహారం ఇంత వరకు ఇవ్వలేదు.

బలగ పోలినాయుడు యువరైతు శివ్వాం.

వివరాలు తర్వాత వెల్లడిస్తా

ఈ విషయంపై అటవీ శాఖ బొబ్బిలి బీట్ అధికారి స్వప్నను గతసారి ఎంతమంది రైతులు నష్టపరిహారానికి సంబంధించి దరఖాస్తు చేశారు? ఎంతమందికి నష్టపరిహారం చెల్లించారు? ప్రస్తుత పరిస్థితి పైన వివరణ కోరగా గతంలో అర్హులైన వారందరికీ నష్టపరిహారం చెల్లించామని కొంతమంది ఆధారాలు లేకుండానే దరఖాస్తు పెడుతున్నారని అన్నారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయనే దానిపైన తాను ప్రస్తుతం ఫీల్డ్‌లో ఉన్నానని కార్యాలయానికి వెళ్లేసరికి పది రోజులు అవుతుందని అంతవరకు ఏమీ చెప్పలేను అని బదులిచ్చారు. ప్రస్తుతం పంటలు నష్టానికి సంబంధించి ఏనుగులు ఇక్కడ నుంచి ఐదు కిలోమీటర్ల దూరం వెళితే అప్పుడు వేరే వాళ్ళు వచ్చి పరిశీలిస్తారని సమాధానం చెప్పారు.

ఇంటి వద్దే రేషన్ పంపిణీ

ప్రజాశక్తి- శృంగవరపు కోట

వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులను అందిస్తున్నామని పట్టణంలోని 211 రేషన్ డిపో డీలర్ చిప్పాడ రమణ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా జులై నెల రేషన్ బియ్యాన్ని జూన్ నెల ఆఖరిలో 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, వికలాంగుల ఇంటి వద్ద కెళ్ళి ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 26వ తేదీ నుండి 30వ తేదీ వరకు రేషన్ సరుకులను అందిస్తున్నామని మిగతా వారు యథావిధిగా రేషన్ డిపో వద్దకు వెళ్లి రేషన్ సరుకులు తీసుకోవాలని ఆయన తెలిపారు.

సైనిక్ పాఠశాల, నవోదయకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని పోతురాజు పట్టి వద్దగల మోపాడ కిషన్ నాయుడు స్కూల్ అండ్ గైడెన్స్ ఆఫ్ ఈడబ్ల్యూఈ ఇన్స్టిట్యూషన్స్‌కు చెందిన ముగ్గురు నవోదయకి, ఒకరు సైనిక్ స్కూల్‌కి ఎంపికయ్యారని పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ మోపాడ బాలు హర్షం వ్యక్తం చేశారు. తమ వద్ద 14 మంది చదివితే నలుగురు ఎంపికవడం ఆనందంగా ఉందన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం వల్ల నవోదయ, సైనిక్ స్కూల్ లాంటి అత్యున్నతమైన పాఠశాలకు విద్యార్థులు ఎంపిక అవుతున్నారని ఆయన అన్నారు. ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులను అభినందించారు.



మాట్లాడుతున్న జెసి రాజు

భాషా బోధకులను నియమించాలి

ప్రజాశక్తి - బొబ్బిలి


ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు, హిందీ భాషను బోధించే ఉపాధ్యాయులను తక్షణమే నియమించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జెసి రాజు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఏపిటిఎఫ్ కార్యాలయంలో మండల శాఖ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన జోనల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి రాజు మాట్లాడుతూ ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు, హిందీ బోధించే ఉపాధ్యాయులను ప్రభుత్వం నియమించక పోవటం వల్ల విద్యార్థులు నమోదు కావటం లేదని, ఉన్న విద్యార్థులకు పై సబ్జెక్ట్స్ బోధన లేకపోవటంతో 10వ తరగతిలో ఇబ్బంది పడవలసి వస్తుందన్న ఉద్దేశంతో తల్లితండ్రులు 6,7,8, యుపి స్కూల్‌లో చదివే పిల్లలను సమీప ఉన్నత పాఠశాలలో చదివించటానికి ఆసక్తి చూపడంతో ప్రాథమికోన్నత పాఠశాలలు కనుమరుగయ్యే ప్రమాదముందని అన్నారు. మిగులు ఉపాధ్యాయులనైనా యుపి పాఠశాలల్లో నియమించాలని డిమాండ్ చేశారు. సుదీర్ఘ కాలంగా ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు ప్రభుత్వం బకాయిపడిన డిఎలను, పిఆర్‌సి బకాయిలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. పిఆర్‌సి కమిషన్‌ను తక్షణం ఏర్పాటు చేయాలని, మధ్యంతర భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాన్ని ఆగస్టు నెలకు మార్చాలని కోరారు. సమావేశంలో ఏపిటిఎఫ్ కార్యకర్తలు ఆర్ఎన్ రాజు, ఏ చిన్నారావు, బి డి దర్శనం, సభ్యులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

- జెడ్‌పి ఎఒ త్రినాథరావు

ప్రజాశక్తి-విజయనగరం

చిత్తశుద్ధి, అంకిత భావంతో పనిచేస్తే అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారుల నుంచి మన్ననలు పొందుతామని జిల్లా పరిషత్తు పరిపాల నాధికారి ఆరవెల్లి త్రినాథరావు తెలిపారు. తాను అలా పనిచేయడం వల్ల అందరి ప్రశంసలు పొందానని చెప్పారు. ఆ రోజుల్లో ఎటువంటి టెక్నాలజీ లేనప్పటికీ పైవారి దగ్గర నేర్చుకొని, అప్పగించిన పనులు పూర్తి చేసేవా రమని గుర్తుచేశారు. ఇప్పుడు అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ ఆ తపన తగ్గుతోందని చెప్పారు. ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా 'ప్రజాశక్తి'తో తన అనుభవాలను పంచుకొన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు అందించే శాఖల్లో పనిచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ప్రధానంగా గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖల్లో పనిచేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. మరిన్ని వివరాలు ఆయన మాటల్లోనే...



మెరకముడిదాం గ్రామంలో 1963 జూలై ఒకటో తేదిన ఆరవెల్లి వెంకట రమణ, సుభద్రమ్మ దంపతులకు జన్మించిన నాకు ఇద్దరు అక్కచెల్లెలు ఉన్నారు. భార్య నాగమణి, కుమారుడు కృష్ణ చైతన్య, కుమార్తె రాగ చంద్రిక ఉన్నారు. పిల్లలు ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు.

ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు శ్రీకాకుళం జిల్లా లావేరులో, ఇంటర్మీడియట్ గరివిడి శ్రీరామ్ జూనియర్ కళాశాలలో, డిగ్రీ విజయనగరం మహారాజా కళాశాలలో పూర్తిచేశాను. 1987 అక్టోబర్ 13న జిల్లా పరిషత్తు ద్వారా టైపిస్టుగా ఎంపికై, తెర్లాం ఎంపిడిఒ కార్యాలయంలో విధుల్లో చేరాను. అక్కడ ఏడేళ్లపాటు విధులు నిర్వర్తించాను. 1994 నుంచి 2000 వరకు మెరకముడిదాం మండలంలో పనిచేస్తున్న కాలంలో ఉద్యోగోన్నతి పొంది, 2000 నుంచి 2002 వరకు జియ్యమ్మవలస మండలంలో, 2003 నుంచి 2007 వరకు విజయనగరం డిఆర్‌డిఎలో పనిచేశాను. ఈ కాలంలో జెడ్‌పికి వచ్చి వెంటనే మరల డిఆర్‌డిఎకి వెళ్లి 2011 వరకు పనిచేశాను. 2011 నుంచి 2015 వరకు భోగాపురంలో పనిచేస్తున్న సమయంలో పరిపాలనాధికారిగా ఉద్యోగోన్నతి లభించడంతో బొబ్బిలి బదిలీ అయింది. అక్కడ 2015 నుంచి 2019 వరకు పనిచేసిన కాలంలో బొబ్బిలితోపాటు మెరకముడిదాం, భోగాపురం మండలాల్లో ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా బాధ్యతలు నిర్వర్తించాను. 2019 నుంచి 2022 వరకు మెరకముడిదాం బదిలీపై రాగా, ఈ కాలంలో బలిజిపేట, సీతానగరం మండలాల్లో ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా పనిచేశాను. 2022 నుంచి ఇప్పటి వరకు జిల్లా పరిషత్తులో పనిచేస్తున్నాను.

జియ్యమ్మవలస మండలంలో పనిచేసిన కాలంలో అక్కడ అస్తవ్యస్తంగా ఉన్న రికార్డులు సరిచేసి, కార్యాలయాన్ని గాడిలో పెట్టి, ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేయడంతో అప్పటి ప్రజాప్రతినిధులు విజయరామరాజు, చంద్రశేఖరరాజు పౌరసన్మానం చేశారు. డిఆర్‌డిఎలో పనిచేసిన కాలంలో అప్పటి ఎంపి బొత్స ఝాన్సీలక్ష్మి మంజూరు చేయించిన రాష్ట్రీయ గ్రామీణ వికాస్ యోజన పథకంలో ఫ్యాషన్ టెక్నాలజీ అమలు, నైపుణ్యాభివృద్ధిలో యువతి యువకులకు శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో నా పాత్ర ఉండటం చాలా సంతోషంగా ఉంది. పనిచేసిన ప్రతి ప్రాంతంలో అందరి మన్నలు పొందడం నా జీవితంలో మరిచిపోలేని సంఘటనలు.

2006లో డిఆర్‌డిఎలో పనిచేసే కాలంలో మంత్రి నుంచి, 2014లో జిల్లా పరిషత్తులో చేసినప్పుడు అప్పటి చైర్మన్ నుంచి, 2017లో ఎంపిడిఒగా పనిచేసే సమయంలో అప్పటి మంత్రి నుంచి, 2023లో జిల్లా కలెక్టర్, 2025లో జిల్లా పరిషత్తు చైర్మన్ నుంచి ఉత్తమ అధికారిగా అవార్డులు అందుకున్నాను. మొత్తం ఉద్యోగ జీవితం విజయవంతంగా పూర్తి చేయడానికి సహకరించిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు, సహచర ఉద్యోగులకు, కింది స్థాయి సిబ్బందికి కృతజ్ఞతలు.



మొగధారగూడలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కేంద్ర కమిటీ సభ్యులు

గృహ నిర్మాణాలపై కేంద్ర బృందం సంతృప్తి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మొగధారగూడ కాలనీ నిర్మించిన పిఎం జన్మాన్ గృహ నిర్మాణాల పట్ల కేంద్రం బృందం పరిశీలకులు రాహుల్ కూరాణ సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ఏ విధంగా అమలు అవుతున్నాయో ఆదివారం క్షేత్రస్థాయిలో కేంద్రబృందం పరిశీలించింది. ఇందులో భాగంగా మొగధారగూడలోని మొగధార కాలనీలో నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించారు. బిల్లుల చెల్లింపుతో పాటు గృహ నిర్మాణంలో వేగవంతం జరగడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. గృహాల పనులు శరవేగంగా పూర్తి కావడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం చినరామలో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయిలను పరిశీలించారు. అనంతరం గిరిజనులతో మాట్లాడారు. ఈ నీరు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం దిగువ బుడగరాయలో అంగన్వాడీ పిల్లలతో కాసేపు మాట్లాడారు. అంగన్వాడీ భవన నిర్మాణానికి స్థలం పరిశీలించారు. అనంతరం ఐటిడిఎ సమీపంలో ఉన్న ముక్కుడు పోలమ్మ విడివికె వందన్ వికాస కేంద్రాలను పరిశీలించారు. అక్కడ జీడిపప్పు, అగరబత్తీల ప్రాసెసింగ్ యూనిట్లను పరిశీలించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఎఇ సిహెచ్ వెంకటేష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సత్యం, పిఆర్ ఎఇ కిరణ్, సిడిపిఒ సిమ్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎఎన్ఎంల నియామకం చేపట్టాలి

20 నుంచి రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంల నియామకం చేపట్టాలని కోరుతూ జులై 20 నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరవధిక రిలే నిరాహారదీక్షలు చేపట్టనున్నట్లు గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ ఇప్పటికే ఒక ఆశ్రమ పాఠశాల గిరిజన విద్యార్థి మృతి చెందిందని తెలిపారు. ప్రతి ఏటా గిరిజన విద్యా సంస్థల్లో గిరిజన విద్యార్థులు మరణిస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని అన్నారు. గిరిజన మంత్రి మొదటి సంతకానికి విలువ లేని పరిస్థితి రాష్ట్రంలో కూటమి పాలన ఉందని విమర్శించారు. గతంలో గిరిజన విద్యార్థులకు వైద్య సేవలు చేసిన ఆదివాసీ ఆరోగ్య సిబ్బందిని తిరిగి నియమించాలని రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు.వారందరు దీక్షల్లో పాల్గొనాలని కోరారు.

అనారోగ్యంతో గిరిజన యువకుడు మృతి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మొగధార గ్రామానికి చెందిన ఎన్.తులసీదాస్ (30) అనారోగ్యంతో మృతి చెందాడు. తులసీదాస్‌కు అనారోగ్యం కావడంతో శనివారం రాత్రి స్థానిక ఏరియా ఆసుపత్రికి చేర్పించారు. అక్కడ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం పాలకొండ రిఫర్ చేశారు. మార్గమధ్యలో మృతి చెందారు. తులసీదాసుకు భార్య సరిత ఉంది. తులసీదాస్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విశ్రాంత ప్రిన్సిపల్‌కు సన్మానం

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే బాలికల పాఠశాల ప్రిన్సిపల్ మూకల పెంటయ్య ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా ఆదివారం ఆ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పెంటయ్య దంపతులను పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పెంటయ్య ప్రిన్సిపాపగా పని చేసిన సమయంలో ఏటా విద్యార్థినులు ట్రిబుల్ ఐటిలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆయన సేవలను కొనియాడారు.

నకిలీ ఎస్‌టి ధ్రువపత్రాలు రద్దు చేయాలి

ఎజెఎసి సమావేశంలో నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - పార్వతీపురం

మన్యం జిల్లాలో 250 మంది నకిలీ గిరిజన ధ్రువపత్రాలు రద్దు చేయాలని ఆదివాసీ హక్కుల సాధన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి మన్యం జిల్లా కార్యవర్గ సమావేశంలో నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక గిరిజన సామాజిక భవనంలో నిర్వహించిన సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. మన్యం జిల్లాలోని 250 నకిలీ గిరిజన కులధ్రువీకరణ పత్రాలు రద్దు చేయమని ఆదివాసీ సంఘాలు ఏళ్ల తరబడి ప్రభుత్వానికి ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత అధికారులు దర్యాప్తు చేయడం లేదన్నారు. ఒకటి, రెండు కేసులు దర్యాప్తు చేసిన తర్వాత జిల్లా స్థాయి అధికారులు ఉదాసీన వైఖరి అవలంభిస్తూ ఆదివాసీలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. అమాయకులైన గిరిజన హక్కులు కాపాడడంలో భాగంగా తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలు పొందిన వారిపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం, సుప్రీంకోర్టుల్లో వేసిన దావాలపై న్యాయ ఆర్థిక సహాయం ఐటిడిఎలు అందజేయాలని కోరారు. 1/70 చట్టం అమలులో ఉన్న ప్రాంతంలో గిరిజన ప్రాంతంలో గిరిజనేతరులు వలసలు పెరిగి ప్రభుత్వ, ఆదివాసీ భూములు ఆక్రమించుకొని వాణిజ్య సముదాయాలు ఇల్లు నిర్మించుకొని అనుభవిస్తున్నారని, వారిపై పలు ఫిర్యాదులు అధికారులకు ఇచ్చినా స్పందించడం లేదని చెప్పారు. జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రతి సోమవారం నిర్వహిస్తున్నా ఆదివాసీల సమస్యలు పరిష్కారం కావడం లేదని చెప్పారు. ఈ సమస్యల పరిష్కారానికి ఐటిడిఎ పిఒలు ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. గిరిజన సమస్యల పరిష్కారంలో భాగంగా ఐటిడిఎ జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించకపోవడం చాలా దారుణమని, ప్రభుత్వం తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు . గిరిజనులకు ప్రత్యేక డిఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఆశ్రమ పాఠశాలలో గిరిజన వసతి గృహాల్లో ఎఎన్ఎంల లను నియమించాలని కోరారు. సమావేశంలో అధ్యక్షులు కొండగొర్రి ధర్మారావు, జిల్లా గౌరవ అధ్యక్షులు నిమ్మక జయరాజు, ముఖ్య సలహాదారులు ఆరిక నీలకంఠం, ప్రధాన కార్యదర్శి జయన్న, వైస్ చైర్మన్ రోబ్బా లోవరాజు, తాడంగి రామారావు, కొలక గౌరమ్మ, పల్ల సురేష్, వెంకటేశ్వరరావు, మల్లయ్య, బిడ్డిక రామారావు, ఎం.తిరునాధ, వి.తిరుపతి, ఎం.శివుడు, మగ్గయ్య, కొండలరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు

అద్దెబస్సు డ్రైవర్లకు లేబర్ చట్టాలు అమలుచేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎపి ఎస్ ఆర్టీసీ లో పనిచేస్తున్న అద్దె బస్సు డ్రైవర్లకు లేబర్ చట్టాలను అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, హైయర్ బస్సు కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కెవి చారి డిమాండ్ చేశారు. యూనియన్ అధ్యక్షుడు కెవి చారి అధ్యక్షతన ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో వేణు, అచారితో పాటు యూనియన్ కార్యదర్శి పి.డి.ప్రసాద్, కోశాధికారి ఎస్.మన్మధరావు, కోశాధికారి సి.అశోక్ మాట్లాడారు. ఈనెల 10న యూనియన్ జనరల్ బాడీ నిర్వహించుకుని ఆర్టీసి డిఎం, జిల్లా డిపిటిఒ పర్సనల్ ఇన్చార్జ్‌కి, సెక్యూరిటీ అధికారికి, అద్దె బస్సులు యజమానులకు డిమాండ్ల పత్రాలు ఈనెల17న అందజేసినట్లు చెప్పారు. ఇంతవరకు యజమానులు, అధికారులు పట్టించుకోనందున ఈనెల 30న జిల్లా కలెక్టర్‌కు, లేబర్ అధికారులకు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. జూలై 1న నిరసన బ్యాడ్జీలు, దశలవారీ నిరసనలు, ఆందోళన, సమ్మె చేపట్టాలని యూనియన్ కమిటీ సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. పార్వతీపురం డిపోలో సుమారు 33 అద్దె బస్సుల్లో 70 మందిడ్రైవర్లు పనిచేస్తున్నారని చెప్పారు. 350 కిలోమీటర్లు తిరుగుతున్న బస్సులకు ఒటి రూ.16,000 గా, 390 కిలోమీటర్లు తిరుగుతున్న బస్సులకు (డే అవుట్) రూ.19,500గా, 552 కిలోమీటర్లు తిరుగుతున్న బస్సులకు (విశాఖపట్టణం నైట్ అవుట్) రూ.24,000గా నిర్ణయించాలని కోరారు. డ్రైవర్లకు ఏడాదికి 2 జతల యూనిఫామ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి సంక్రాంతికి బోనస్ మంజూరు చేయాలని, డ్యూటీకి రావడానికి ఐడి కార్డులు ఇప్పించాలని, అన్ని లేబర్ చట్టాలు, కనీస వేతన చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీతానగరం ఎస్ఐ రాజేష్

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి -సీతానగరం

స్థానిక హనుమాన్ జంక్షన్‌లో ఆదివారం ఎస్సై ఎం.రాజేష్ వాహనాలు తనిఖీలు నిర్వహించారు. అనంతరం వాహనదారులతో మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల వారికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. అంతేకాక వారి కుటుంబానికి రక్షణ అని అన్నారు. అలాగే తెలియని వ్యక్తుల నుంచి అనవసరపు కాల్స్ వస్తే వాటిని తిరస్కరించాలన్నారు. అంతేకాకుండా వాట్సాప్‌ల ద్వారా వచ్చే మెసేజ్‌లను గమనించాలని, సైబర్ నేరాల పట్ల అవగాహన ఉండాలని అన్నారు. అలాగే యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండాలని, ప్రతి ఇంటి యజమాని వారి పిల్లల పట్ల ఎప్పటికప్పుడు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తిరుపతిరావు నాయుడు, వాహనదారులు పాల్గొన్నారు.

సీతంపేట : మండల కేంద్రంలో సైబర్ నేరాలపైఎస్సై వైఅమ్మనరావు యువతకు, వాహనదారులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరక్కుండా అవగాహన కల్పించారు. మితిమీరి వేగంతో వెళ్లరాదన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని, అన్ని ధవపతలు ఉండాలని సూచించారు. మైనర్లకు ద్విచక్ర వాహనం ఇస్తే బాధ్యులపై చర్యలు తీర్చుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభమయ్యేనా?

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి మధ్య వట్టిగెడ్డ వంతెన నుంచి స్వామి థియేటర్ వరకు కిలోమీటర్ పైబడి ఉన్న ఉమ్మడి శ్రీకాకుళం అర్బన్ డెవలప్ అథారిటీ ఆధ్వర్యంలో రూ.50 లక్షల అంచనా వ్యయంతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు ఈ ఏడాది మే 8న చైర్మన్ కొరికాన రవికుమార్, స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అప్పట్లో ప్రధాన రహదారిని పరిశీలించారు. ప్రధాన రహదారిని పరిశీలించి దాదాపుగా 50 రోజులు కావస్తున్నప్పటికీ ఇక్కడ ఎటువంటి పనులు ప్రారంభించకపోవడం పట్ల స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఆర్భాటంగా ప్రచారానికా లేదా? పనులు చేసేందుకా అంటూ? స్థానికులు ప్రశ్నలు కురిపిస్తున్నారు. తక్షణమే పనులు ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.



వీరఘట్టం ప్రధాన రహదారిలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు అధికారులతో మాట్లాడుతున్న చైర్మన్, ఎమ్మెల్యే (ఫైల్

డంపింగ్ యార్డులో వ్యర్థాలు తరలించేనా?



డంపింగ్‌యార్డులో పేరుకుపోయిన చెత్త

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్.

స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్‌లో భాగంగా గత ఏడాది అక్టోబర్‌లో పట్టణ శివారులో ఉన్న డంపింగ్ యార్డ్‌లో వ్యర్థాల తరలింపునకు ప్రణాళికలు సిద్ధం చేయాలని మున్సిపల్ ప్రత్యేక అధికారి నియమితులైన పి.నల్లనయ్య ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేసి 9 నెలలు కావస్తున్నా ఒక్క అడుగు కూడా ముందుకు పడక పోవడం గమనార్హం. గతేడాది అక్టోబర్ 17న మున్సిపల్ ప్రత్యేక అధికారిగా నియమితులైన విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య పార్వతీపురం మున్సిపల్ కార్యాలయానికి వచ్చి అప్పటి ఇన్చార్జి కమిషనర్ సన్యాసిరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.పకీరు రాజు, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పట్టణ శివారులో ఉన్న డంపింగ్ యార్డును పరిశీలించారు. డంపింగ్ యార్డుల్లో పేరుకు పోయి పర్యావరానికి హానికలిగించే ప్లాస్టిక్‌తో పాటు ఇతర వ్యర్థపదార్థాలు తరలించేందుకు విశాఖపట్నానికు చెందిన తరుణ్ అసోసియేట్స్‌తో ప్రజారోగ్య శాఖ ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, పాలకొండతో పాటు, శ్రీకాకుళం జిల్లాలో ఆముదాలవలస, ఇచ్చాపురం, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీల్లోనూ ఉన్న అన్నిరకాల వ్యర్థ పదార్థాలను తరలించేందుకు ఈ సంస్థతో ఒప్పందం జరిగింది. ఈ ప్రక్రియ చేపట్టేందుకు స్థలం, 40 కెవి ట్రాన్సఫారం, ఒక బోరును ఏర్పాటు చేయాలని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించిన విషయం సంగతి తెలిసిందే.

ఈ ప్రక్రియ జరిగిన 9 నెలలు అయినప్పటికీ పనులు చేపట్టడంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యేరనే చెప్పవచ్చు. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ శనివారం రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో డంపింగ్ వార్డుల్లో పేరుకుపోయిన చెత్తలను, ప్లాస్టిక్ వ్యర్థాలను ఈ అక్టోబర్ 2 నాటికి తరలించి విద్యుత్ ఉత్పత్తికి ఉపయోగిస్తామని చెప్పడం సంతోషదాయకమే. ఇప్పటికైనా పార్వతీపురం డంపింగ్ యార్డులో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన వ్యర్థాలు తొలగింపు ప్రక్రియ జరుగుతుందో లేదో చూడాలి మరి.

ఏజెన్సీలో పడకేసిన పర్యాటక పనులు

- టూరిజం హబ్‌గా సీతంపేట కల నెరవేరేనా?
- నిధుల లేమితో నిలిచిన పనులు
- ఏడేళ్లుగా పూర్తికాని వైనం
- ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువత

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీ ప్రాంతం పర్యాటకానికి పుట్టినిల్లు. ఇక్కడ మైమరిపించే ప్రకృతి అందాలు... పచ్చని పొలాలు.. ఒంపు సొంపులతో మేఘానికి తాకిన కొండలు... గళగళలాడే జలపాతాలు... కనువిందు చేసే వ్యూ పాయింటు... ఇలాంటి ప్రకృతి అందాలను గుర్తించిన ఐటిడిఎ అధికారులు సీతంపేటను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దాలని అనుకున్నారు. అనుకున్నదే తొడువుగా పనులు చకచక ప్రారంభించారు. దీంతో గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు, వ్యాపారాలు పెరగడంతో సీతంపేట కూడా అరకు మాదిరిగా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందన్న ఉద్దేశంతో టూరిజం, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ ద్వారా పర్యాటక పనులు 2018లో చేపట్టారు. అయితే కొన్ని పనులు పూర్తికాగా మరికొన్ని పనులు నిధులు రాక వచ్చిన నిధులు వినియోగించుకోలేక అర్ధాంతరంగా ఆగిపోయాయి. దీంతో గిరిజన మ్యూజియం జగత్ పల్లి రిసార్ట్స్ ఎకో పార్క్ వంటి పనులు నిలిచిపోయాయి..

నిలిచిపోయిన గిరిజన మ్యూజియం

సీతంపేట పిఎంఆర్‌సి వద్ద 2017లో గిరిజన మ్యూజియం పనులను రూ.కోటి 60లక్షలతో పనులు చేపట్టారు. మ్యూజియంలో ప్రపంచంలోని ఆదివాసీల సంస్కృతి, సాంప్రదాయాలు, పనిముట్లు నమూనాలు సేకరించి మ్యూజియంలో ప్రదర్శించాలని అనుకున్నారు. అయితే ఇప్పటి వరకు టూరిజం అధికారులు 60 శాతం వరకు పనులు పూర్తి చేశారు. ఇంకా మరికొంత నిధులు మ్యూజియంకు అవసరమని అధికారులు అంచనాలు వేశారు. మిగిలిన పనులు పూర్తి చేయాల్సి ఉంది.

పడకేసిన జగత్ పల్లి రిసార్ట్స్ పనులు

సీతంపేట పట్టణానికి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఎత్తయిన కొండపైన 2017 -18 లో జగత్ పల్లి రిసార్ట్స్‌కు రూ.7 కోట్లు మంజూరైంది. కొండపైన ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి సోయగాలు అక్కడ నుంచి చూస్తే సీతంపేట పట్టణమంతా కనిపిస్తుంది. అయితే ఈ పనులు కొన్ని భవనాలు శ్లాబ్ వరకు సుమారు రూ.40 లక్షలతో జరిగాయి. అనేక కారణాలతో పనులు నిలిచిపోయాయి. ఆ పనులు కూడా ఏడు ఏళ్లుగా పడకేశాయి.

ఫెన్సింగ్‌కే పరిమితమైన ఏకో పార్క్

మండల కేంద్రంలోని తూరాయిపువలస టిటిడి దేవాలయం సమీపంలో ఉన్న ఉద్యానవనాల నర్సరీలో ఏకో పార్క్ నిర్వహించాలని అధికారులు సన్నాహాలు చేశారు. వెంటనే పునాదులు ఇంటర్నల్ రోడ్డు ఉద్యానవనాల ఫారంలో చేయించారు. అయితే ఏకో పార్కులో ఉద్యానవనాలు, వ్యవసాయ శాఖ సెరీకల్చర్, హార్టికల్చర్ నమూనాలు ఉంటూ రైతులకు ఎన్ని రోజుల్లో పంటలు వస్తాయి డెమోలు ఏర్పాటు చేయాలని, రైతులు చూస్తే సులువుగా అవగాహన కల్పించేలా ప్రణాళికలు రూపొందించారు. అయితే ఈ పార్క్ పనులు ఇంటర్నల్ రోడ్డు ఖానాల చుట్టూ ఫెన్సింగ్‌కే పరిమితమైంది.

అరకొరగా సున్నపు గెడ్డ జలపాతం పనులు

సన్నపు గెడ్డ జలపాతం ఎప్పటి నుంచో ప్రసిద్ధి. దీన్ని అభివృద్ధి చేయాలని అధికారులు ప్రణాళికలు రూపొందించారు. సున్నపుగెడ్డ జలపాతం ముఖద్వారం వద్ద చెక్కలతో గేటు పనులు చేపట్టారు. సున్నపు గెడ్డకు వెళ్లే రహదారి పనులు, జలపాతం పైనుంచి వెళ్లడానికి బ్రిడ్జి పనులు ఇతర పనులు చేపట్టాల్సి ఉంది. అదేవిధంగా పొల్ల, యు పాయింట్, దారిమల్లి జలపాతం తదితర పర్యాటక ప్రాంతాలు అభివద్ధి చేస్తే నిరుద్యోగ యువతకు ఉపాధితో పాటు పర్యాటక హబ్‌గా సీతంపేట ఏజెన్సీ తయారవుతుంది.

ఆడలిలో ఆగిన రిసార్ట్స్ పనులు

సీతంపేట ఏజెన్సీలో సుమారు పది కిలోమీటర్ల దూరం ఉన్న ఆడలి యు పాయింట్ పనులు పూర్తి చేసినప్పటికీ ఇంకా రిసార్ట్స్ పనులు చేయాల్సి ఉంది. పర్యాటకులు రాత్రివేళల్లో ఉండేందుకు రిసార్ట్స్ ఏర్పాటు చేస్తామని ఇప్పటికే అధికారులు చెప్పుకొచ్చారు. అయితే ఇంకా పనులు ప్రారంభించలేదు.



సున్నపు గెడ్డ జలపాతం వద్ద చెక్కలతో నిర్మించిన ముఖ ద్వారం



పిఎంఆర్‌సిలో పనులు నిలిచిపోయిన గిరిజన మ్యూజియం

టెండర్లకు మళ్లీ పిలుస్తారు

జగత్‌పల్లి రిసార్ట్స్ పనులకు టూరిజం అధికారులు ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో టెండర్లకు పిలిచారు. ఎవరూ రాకపోవడంతో మళ్లీ పిలుస్తారు.

నడిమింటి నారాయణ రావు, జిల్లా టూరిజం అధికారి.

ఆడలి రిసార్ట్స్ పనులకు టెండర్లు వేశాం

ఆడలి రిసార్ట్స్ పనులు ఉన్నతాధికారులు రూ.60 లక్షలతో టెండర్లు వేశారు. అది పూర్తికాగానే పనులు ప్రారంభిస్తాం. ప్రస్తుతం ఎన్‌ఆర్ఇజిఎస్‌లో ఆడలి రక్షణ గోడ పనులు జరుగుతున్నాయి.

కెవిఎస్ఎన్ కుమార్, ఇఇ ట్రైబల్ వెల్ఫేర్ సీతంపేట ఐటిడిఎ

పర్యాటక పనులు చేపట్టాలి

గిరిజన మ్యూజియం జగత్ పల్లి రిసార్ట్స్ ఎకో పార్క్ వంటి పర్యాటక పనులు ఏడు ఏళ్లుగా నిలిచిపోయావి. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి పనులు చేపడితే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చేకూరుతాయి.

ఎం.తిరుపతిరావు, గిరిజన సంఘం నాయకులు

2న మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని రేగులపాడు సచివాలయం పరిధిలోని బొడ్లపాడులో జులై 2న ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మెగా వైద్య, రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సంయుక్త కార్యదర్శి జనసేన జానీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, జనసేన పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ ప్రారంభిస్తారని, ఈ అవకాశాన్ని చుట్టుపక్కల గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న విఆర్‌ఒ సంఘం జిల్లా అధ్యక్షులు సింహాచలం

క్లస్టర్లుగా రెవెన్యూ వ్యవస్థకు అపహాస్యం తప్పదు

ప్రజాశక్తి - పాలకొండ

సచివాలయాలు క్రమబద్ధీకరణకు తాము వ్యతిరేకం కాదని 3,4 సచివాలయాలకు ఒక క్లస్టర్ చేసి విఆర్ఒను మించడం వల్ల రెవెన్యూ వ్యవస్థను అపహాస్యం చేయడం తప్ప దీనివల్ల సకాలంలో సేవలు అందించడానికి ఇబ్బందులు ఎదురవుతాయని విఆర్ఒల సంఘం జిల్లా అధ్యక్షులు మరడ సింహాచలం అన్నారు. పట్టణంలో విఆర్వోల సంఘం జిల్లా సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లస్టర్ వ్యవస్థ వల్ల కనీస అవసరాలకు ప్రజలు మూడు, నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సి వస్తుందని అన్నారు. అలాగే గిరిజన ప్రాంతాల్లో 10 నుంచి 15 గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతారన్నారు. జిఎస్‌డబ్ల్యుఎస్ సేవలో 90 శాతం పనులు రెవెన్యూ శాఖ వారు చేయాలని, కావున సచివాలయం రేషనలైజేషన్ నుండి విఆర్వోలకు మినహాయింపు ఇవ్వాలన్నారు దీనిపైన న్యాయ పోరాటానికి వెనకాడేది లేదన్నారు. సమావేశంలో శ్రీకాకుళం జిల్లా విఆర్ఒ సంఘం అధ్యక్షులు వి.రమేష్‌కుమార్, మన్యం జిల్లా అసోసియేట్ అధ్యక్షులు బంటి రాజా, రాష్ట్ర ఉపాధ్యక్షులు గవర మురళి, డివిజన్ అధ్యక్షులు రఘుకుమార్, విఆర్ఒ పాల్గొన్నారు.

రథయాత్ర కన్నుల పండగగా జరిపించాలి

ప్రజాశక్తి - పాలకొండ

రథయాత్ర కన్నుల పండగ జరిపించాలని నగర పంచాయతీ సమన్వయకర్త పల్లా కొండలరావు అన్నారు. ఆదివారం రథయాత్రను పరిశీలించారు విఐపి పేరుతో గంటలకొలదీ ఆలయంలో దర్శనాలు చేయించి సామాన్య యాత్రికులకు ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. సత్యసాయి సేవాసమితి వారు మూడు రోజులు తాగునీరందిస్తారన్నారు. విజయ హాస్పిటల్ సౌజన్యంతో మెడికల్ క్యాంపు కూడా నిర్వహిస్తామన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు చేపట్టేలా చూస్తామన్నారు. సమావేశంలో ఆలయ ఇఒ సర్వేశ్వరరావు, పట్టణ టిడిపి అధ్యక్షులు గంట సంతోష్ కుమార్, పడాల రాంబాబు, అడపా బాబ్జీ తదితరులు ఉన్నారు.

కోటిపాం రైతులకు ఉపశమనం

ప్రజాశక్తి - కొమరాడ

కోటిపాం రైతులకు ఖరీఫ్‌లో సాగునీటి అందించేందుకు ఎమ్మెల్యే నిధులు కేటాయించడంతో ఆ గ్రామ రైతులకు కొంతమేరకు ఉపశమనం కలుగుతుంది. మండలంలోని వనకాబడి చెక్‌డాం నుంచి కోటిపాం, కొత్త చెరువు వరకు గల పంట కాలువల మరమ్మతులకు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి రూ.5 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు టిడిపి అడ్‌హక్ కన్వీనర్ ఎస్.శేఖర్‌పాత్రుడు తెలిపారు. ఈ మేరకు ఆదివారం నుంచి మరమ్మతులు పనులను నీటి సంఘం అధ్యక్షుడు వడ్డి సోమేశ్వరరావు ఆధ్వర్యంలో జరుగుతున్నట్లు తెలిపారు. దీంతో ఖరీఫ్‌సాగుకు నీటికి కొరత ఉండదని ఆ గ్రామ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నిధులు కేటాయించినందుకు గానూ ఎమ్మెల్యేకు కోటిపాం గ్రామ రైతులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.




మరమ్మతులకు చేపట్టిన పంట కాలువ

ప్రవేశాలు పెరగాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి, ఆరో తరగతుల్లో ప్రవేశాలు పెరగాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ విద్యా శాఖాధికారులను ఆదేశించారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 1, 6వ తరగతుల్లో ప్రవేశాలు తక్కువగా ఉన్నాయని అన్నారు. ఇందుకోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, విద్యార్థులు చేరేలా శ్రద్ధ కనబరచాలని అన్నారు. డిజిటల్ అసిస్టెంట్లు, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ సూపర్ వైజర్లు, విఆర్ఒల సహకారం తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రవేశాలన్ని ఈ డ్రైవ్ ద్వారా భర్తీ కావాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ ఆదివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అర్హతలు కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని, అత్యుత్తమ విద్యా ప్రమాణాలతో పాటు అన్ని వసతులు కల్పించడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్, షూస్, నోట్ బుక్స్ తదితర సామాగ్రి కిట్లను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని అన్నారు. మధ్యాహ్న భోజన పథకంతో విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించడమే కాకుండా తల్లికి వందనం కింద రూ.15వేలు ప్రభుత్వం మంజూరు చేస్తోన్న సంగతిని కలెక్టర్ గుర్తు చేశారు. ఇన్ని వసతులు, లబ్దిని చేకూర్చే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు ప్రతి ఏటా పెరగాలని, ఆ దిశగా తల్లిదండ్రులకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలలో చేరే ప్రతి విద్యార్థికి పర్మినెంట్ ఎడ్యుకేషన్ నెంబర్ (పెన్) కేటాయించాలని, ఆ నెంబరు ఉంటేనే విద్యార్థి రిజిస్టర్ అయినట్లవుతుందని తెలిపారు. తద్వారా తల్లికి వందనం వర్తిస్తుందని, ఇందుకు అవసరమైన ధ్రువపత్రాలు పొందాలని, లేనిచో వాటికి దరఖాస్తు చేయించి పెన్ పొందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితిల్లో జూలై 1 నాటికి ఈ ప్రక్రియ పూర్తికావాలని అన్నారు. సమావేశంలో డిఇఒ బి.రాజ్‌కుమార్, ఐసిడిఎస్ పీడీ డాక్టర్ టి.కనకదుర్గ, ఎంఇఒలు, పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న ఉత్తరాంధ్ర సాధన సమితి కన్వీనర్ లక్ష్మనాయుడు

రాజకీయ దోపిడీ నుంచి ఉత్తరాంధ్రను కాపాడుకుందాం

ఉత్తరాంధ్ర సాధన సమితి సదస్సులో వక్తలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రాజకీయ దోపిడీ నుంచి ఉత్తరాంధ్రాను కాపాడుకుందామని ఉత్తరాంధ్ర సాధన సమితి సభ్యులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల కార్యాలయంలో ఉత్తరాంధ్ర సాధన సమితి వ్యవస్థాపకులు, కన్వీనర్ వేమిరెడ్డి లక్ష్మనాయుడు ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సదస్సులో వక్తలు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడిచినా ఉత్తరాంధ్ర అన్ని రంగాల్లో అత్యంత వెనుకబడి ఉందన్నారు. ఉత్తరాంధ్రలో ఒక్కగానున్న ఏకైక విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కూడా ఈ పాలకులు ప్రైవేటు వారికి అమ్మకానికి చూపుతున్నారని, ఇందుకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇంతకంటే దుర్మార్గమైన చర్య ఇంకోటి ఉంటుందా అని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య, వైద్యం, తాగు, సాగునీరు, లేవని,పరిశ్రమలు అయితే చెప్పుకోవడానికి ఏమీ లేవని అన్నారు. ఉత్తరాంధ్రలో ఏ ఒక్క సాగునీటి ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని, దీంతో ఆనాటి నుంచి ఈనాటి వరకు ఉపాధి కోసం ఇక్కడి ప్రజలు వలస పోతున్నారని, ఇక చదువుకున్న పిల్లలు ఈ ప్రాంతంలో ఏ ఒక్క పరిశ్రమ లేకపోవడంతో వారు కూడా ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారని అన్నారు. ఇక్కడ వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ ఈ పాలకులు నిర్లక్ష్యం వల్ల ఉత్తరాంధ్ర ఉత్తిఆంధ్రగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి ఈ రాజకీయ దోపిడీదారులకు వ్యతిరేకంగా ఉద్యమించి, ఉత్తరాంధ్రను ప్రత్యేక రాష్ట్రంగా సాధించుకుందామని, ఆత్మ గౌరవాన్ని నిలబెట్టుకుందామని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు చుక్క భాస్కరరావు, వంగల దాలినాయుడు, గంట జగన్నాథం, గణపతిరావు, కృష్ణమూర్తి నాయుడు, వెంకట నాయుడు, సత్యనాయుడు సన్యాసిరావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మధ్యతరగతి మందహాసం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్
రచయిత బెహరా వెంకట సుబ్బారావు రచించిన మధ్యతరగతి మందహాసం పుస్తక ఆవిష్కరణ సభను ఆదివారం స్థానిక జెడ్పి సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. కలిగొట్ల సన్యాసిరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథి బహుభాషా గ్రంథకర్త వి.వి.వి రమణ పుస్తకాన్ని ఆవిష్కరించారు. రచయిత కొచ్చర్లకోట జగదీష్, ప్రముఖ జర్నలిస్టు కె.ఎస్.ఎస్. బాపూజీ, సుబ్బారావు కుమారుడు బిఎస్ఎన్ మూర్తి, అరసం జిల్లా అధ్యక్షులు జిఎస్ చలం, ప్రధాన కార్యదర్శి రత్నాల బాలకృష్ణ, రచయిత ఎంఎస్ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

న్యాయ పోరాటం చేస్తున్న రైతుపై దాడి

ప్రజాశక్తి- శృంగవరపు కోట
జిందాల్‌కు భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయాలంటూ పోరాడుతున్న మండలంలోని ముసిడిపల్లి గ్రామానికి చెందిన సన్యాసిరావుపై శనివారం రాత్రి గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు దాడి చేశారని సన్యాసిరావు ఆదివారం తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో గాయాలతో చికిత్స పొందుతున్న సన్యాసిరావును ఆదివారం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పరామర్శించారు. భూములు కోల్పోయిన రైతులకు జిందాల్ యాజమాన్యం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ప్రశ్నిస్తే దాడులు నిర్వహించడం హేయమైన చర్యని దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎస్ఐ గంగరాజు బాధితుని నుంచి వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పిఎసిఎస్‌ల చైర్మన్ల నియామకం

ప్రజాశక్తి - రామభద్రపురం
మండల పరిధిలో ఉన్న 4 పిఎసియస్‌లకు నూతన చైర్ పర్సన్‌లను స్థానిక ఎమ్మెల్యే బేబీనాయన మద్దతు ఇచ్చిన వారికే నియామకం చేశారు. రామభద్రపురానికి చొక్కాపు విజయలక్ష్మి, ఆరికతోటకు జాగాన ప్రసాదరావు, కొత్తరేగకు రెడ్డి పారం నాయుడు, కొట్టక్కికి ముల్లు రాంబాబులు నియమితులయ్యారు. వీరితో పాటు ప్రతీ పిఎసిఎస్‌లో చేరో ఇద్దరు డైరెక్టర్లను కూడా నియామకం చేశారు. రామభద్రపురంలో మహంతి ధనంజయ, సువాడ బలరాం ఎంపికయ్యారు. టిడిపి ఉపాధ్యక్షులు మడక తిరుపతి రావు, బీసీ సెల్ ఉపాధ్యక్షులు కర్రోతు తిరుపతిరావు, డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కాపు రామారావు హర్షం వ్యక్తం చేస్తూ బేబీ నాయనకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - రామభద్రపురం
పలు గ్రామాల్లో సోమవారం విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఎఇ సత్యనారాయణ తెలిపారు. నాయుడువలస ఫీడర్ ఎల్సీ తీసుకుంటున్నందు వల్ల అంతరాయం ఏర్పడుతుందని ఫలితంగా భూసాయవలస, మామిడివలస, పాడివానివలస, ముచ్చర్లవలస, ఎస్.చింతలవలస, నాయుడువలస, మర్రివలస, చింతలవలస, పాలవలస, మండల కేంద్రంలో జగనన్న కాలనీకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.